THE NEW INDIAN EXPRESS
HYDERABAD TUESDAY 10 MAY 2011

# CIFA to Launch State-Wide Stir on Farmers' Woes

**Express News Service**

**Tirupati**: The Consortium of Indian Farmers Association (CIFA) along with other farmers associations and political parties will take up a state wide agitation from May-end to press the government to redress farmers problems.

Speaking to mediapersons here on Monday, CIFA chairman Peddireddy Chengal Reddy said farmers, particularly those in Chittoor, were facing lot of problems due to lack of remunerative price for their produce, including paddy, sugarcane, horticulture crops and milk. Instead of taking suitable steps for ensuring fair deal to farmers, the government was resorting to delay tactics landing farmers in lurch, he averred. The CIFA will hold talks with various farmers societies like water users associations, milk societies etc, political parties and other associations to chalk out a plan and form district committees to spearhead the agitation which would continue till the government concedes their demands. He demanded remunerative price for farm produce. Blaming both the centre and state governments for the plight of farmers, he said by banning export of paddy to other states, the government was depriving farmers from getting remunerative price for their produce.

The government also failed to set up district level rescue mitigation fund as recommended by the Swaminathan Committee for providing succour to horticulture farmers during nature fury, he said.

Citing heavy loss to farmers due to damage of tomato crop in the recent untimely rains in Madanapalli area of Chittoor, he said it is high time the government constituted the fund. Farmers leader M Gopal Reddy and others were present.

స్థానికం
మంగళవారం | మే | 10 | 2011
6
సాక్షి 24|7
చిత్తూరు

# రైతు సమస్యలపై పోరాటాలు ఉద్ధృతం

తిరుపతి(అర్బన్), న్యూస్‌లైన్:

దేశవ్యాప్తంగా రైతు సమస్యల పరిష్కారానికి పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని కన్సోర్టియమ్ ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ (సిఫా) జాతీయ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు సమస్యలపై పూర్తి శ్రద్ధ వహించే ప్రభుత్వాలే మనుగడ సాగిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. రైతులు పండించే పంటలకు ధరల నిర్ణయం, వరి ఎగుమతి, ధరలు తగ్గినప్పుడు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తూ, రైతు సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు చేస్తోందన్నారు. ఈ ఏడాది దేశంలో 1.42 కోట్ల టన్నుల వరి ధాన్యం అవసరం కాగా, ఇప్పటి వరకు ప్రభుత్వం వద్ద 2.82 కోట్ల టన్నులే ఉన్నాయన్నారు. 70లక్షల టన్నుల గోధుమలు కావాల్సి ఉండగా, కేవలం 1.54 కోట్ల టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. దేశం మొత్తానికి 2.12 కోట్ల టన్నుల ధాన్యం అవసరం ఉందని, ప్రస్తుతం 4.42 కోట్ల టన్నుల ధాన్యం నిల్వ ఉందని వివరించారు. రెట్టింపు ధాన్యం ఉన్నప్పటికీ ఎగుమతికి ప్రభుత్వం అనుమతివ్వకపోవడం దారుణమన్నారు. రెట్టింపు ఉన్న ధాన్యాన్ని ఎగుమతి చేయడం వల్ల రైతాంగం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో సోనా మసూరి ధాన్యానికి మంచి గిట్టుబాటు ధర లభిస్తోందని అన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు టన్ను వరి పంటకు ₹2వేలు, చెరుకు పంటకు ₹3వేలు, లీటరు పాలకు ₹35 గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. పాలకుల స్వార్థం, ఉదాసీనతే ఇందుకు ప్రధాన కారణమన్నారు. రైతాంగం సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు, స్వతంత్ర రైతు సంఘాలను ఏకతాటిపైకి తేవడానికి చర్యలు ప్రారంభించామని చెంగల్‌రెడ్డి వెల్లడించారు.

ఇందుకోసం జయప్రకాష్ నారాయణ్‌తో హైదరాబాదులో, కోడెల శివప్రసాద్‌తో విజయవాడలో సమాఖ్య తరపున చర్చలు నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని చర్యలు పూర్తవగానే రైతు సమస్యలపై కామన్ అజెండాను రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పోరాటాలు చేపడతామని వివరించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాంగాటి గోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వీ.రెడ్డెప్పనాయుడు, కార్యదర్శి వయ్యాల కృష్ణారెడ్డి, ప్రాంతీయ రైతు సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, రైతుసేవా సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు కూడా పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న 'సిఫా' నాయకులు

PDF compression, OCR, web optimization using a watermarked evaluation copy of CVISION PDFCompressor

చిత్తూరు వార్త

మంగళవారం 10, మే 2011 పేజీలు : 16



# వరి మద్దతు ధరకు ఉద్యమం!




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి

**తిరుపతిరూరల్, మే 9 ప్రభాతవార్త**

రైతులు పండించిన వరి ధాన్యానికి లాభసాటి ధర కల్పించాలని కోరుతూ ఉద్యమం చేపడుతున్నట్లు అఖిలభారత రైతు సమాఖ్య కార్యదర్శి పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంపై సంబంధిత అధికారులకు, మంత్రులకు సరైన అవగాహన లేకపోవడం వలనే రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక రైతు బడ్జెట్లు ప్రవేశపె ట్టాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు పగటిపూట 12గంటలు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ధాన్యం మద్దతు ధర 1030రూపాయల నుంచి రెం. డువేల రూపాయలకు పెంచాలన్నారు.గతంలో చెరకు టన్నుకు 2,200 చెల్లిం చేవారని ప్రస్తుతం 1600రూపాయలు చెల్లించడం బాధాకర న్నారు .రైతు సంక్షేమ ప్రభుత్వంగా చెప్పుకుంటూ పాలన సాగిస్తున్న ఈ ప్రభుత్వం రైతుల నడ్డివిరుస్తుందని ఆరోపించారు. రైతులు పండించే ధాన్యానికి గిట్టుబాటు ధర లేకనే రాష్ట్ర రైతాంగం కష్టాల ఊబిలో కొట్టుమిట్టాడు తోందన్నారు. వ్యవ సాయంపై ఆధారపడే జీవించేవారు గతంలో 80శాతం మంది వుండగా ప్రస్తుతం 52శాతానికి తగ్గిపోయారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయకపోతే ఇంకెవ్వరు కొంటారని ప్రశ్నించారు. రైతు సమస్యల పరిష్కా రానికి దీర్ఘకాలిక ప్రణాళికను రూపొంది స్తున్నట్లు తెలిపారు.అన్ని జిల్లాల రైతు నాయకులతో చర్చించి లాభసాటి ధరకై త్వరలో ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈమేరకు సోమవారం స్వతంత్ర రైతు సంఘాల నాయకులు హైదరాబాద్‌లో జయ ప్రకాష్‌నారాయణ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించ నున్నట్లుతెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మంగాటి గోపాల్‌రెడ్డి, మోహన్‌రావు,కృష్ణారెడ్డి,పట్టాభిరెడ్డి,చంద్రశేఖర్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

తిరుపతి సిటీ
ఆంధ్రజ్యోతి

మంగళవారం 10-5-2011 5

# గిట్టుబాటు ధరలపై ఉద్యమం

## రైతు సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చెంగల్‌రెడ్డి

తిరుపతి, మే 9 (ఆన్‌లైన్): రైతులకు గిట్టుబాటు ధరలకోసం త్వరలో ఉద్యమించనున్నట్లు అఖిలభారత రైతు సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి తెలిపారు. దీనికి అఖిలపక్షాల మద్దతు తీసుకుంటామన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరి క్వింటాలుకు రూ.2 వేలు, చెరకు టన్నుకు రూ.3 వేలు, పాలు లీటరుకు రూ.30 నుంచి 40 వరకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండు చేశారు. ఎగుమతులకు కేంద్రం, తమ దిగుబడులను రైతులు దేశవ్యాప్తంగా అమ్ముకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వాలని కోరారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయని కేంద్రానికి రైతు సమస్యలపై ఎంతటి చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. ఊరూరా తిరిగి రైతులను చైతన్యవంతులను చేసి సమస్యలపై ఉద్యమానికి సిద్ధం చేస్తామన్నారు. రాత్రిపూట కరెంట్ ఇవ్వడం ద్వారా రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పగటి పూట 12 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అనేక గ్రామాల్లో ఎండోసల్ఫాన్ వాడుకతో పండిన టమోటాలను వినియోగిస్తున్నారని, వీటి ద్వారా ఆరోగ్య సమస్య తలెత్తలేదని ఆయన స్పష్టంచేశారు. కొన్ని ప్రైవేటు కంపెనీలు సొమ్ముచేసుకునేందుకు ఎండోసల్ఫాన్ వాడకంతో ఆరోగ్య సమస్య తలెత్తుతోందని ఆరోపణలు చేస్తున్నారన్నారన్నారు. ఎండోసల్ఫాన్ ధర రూ.300 అయితే ఇతర కంపెనీలు మాత్రం రూ. ఆరు వేలకు విక్రయించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిణామాలతో రైతులు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయకుంటే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా రైతు సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి మాంగాటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతున్నారన్నారు. దీనిపై త్వరలో జయప్రకాష్‌నారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగాను, పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో రెడ్డెప్పనాయుడు, పట్టాభిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, చంద్రశేఖర్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

PDF compression, OCR, web optimization using a watermarked evaluation copy of CVISION PDFCompressor

చిత్తూరు
ఆంధ్రప్రభ
10 మే 2011 మంగళవారం పేజీలు : 16

# రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే పోరాటం తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్, మే 9 (కె.ఎన్‌ఎన్): సరైన ధరలేక అప్పులపాలవుతున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించక పోతే ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటం చేస్తామని అఖిలభారత రైతు సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి హెచ్చరించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులను అశ్రద్ధ చేసిన ప్రభుత్వాలు చరిత్రలో మనుగడ సాగించలేదనే విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం గుర్తించాలని హితవు పలికారు. రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం 1030 రూపాయల ధర ప్రకటించి కనీసం ప్రభుత్వం కూడా కొనుగోలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. చెరకు పంటకు కూడా ఇంత వరకు సరైన ధరను నిర్ణయించకపోవడం విచారకరమన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ప్రయోజనం మాత్రం శూన్యమని, పై స్థాయి అధికారులకు రైతాంగ సమస్యల పట్ల ఏమాత్రం అవగాహన లేదని విమర్శించారు. ముఖ్యంగా చిత్తూరుజిల్లాలోని రైతులకు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు రాకుండా అవస్థలు పడుతున్నారని, తమ ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకుగాని, ఇతర ప్రాంతాలకు గాని అమ్ముకోలేని పరిస్థితులు ఉండడాన్ని చెంగల్‌రెడ్డి ఆక్షేపించారు. రైతులకు తాము పండించిన పంటలను స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని చెంగల్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాంగాటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రూపొందించాల్సిన కార్యక్రమాన్ని నేడు హైదరాబాద్‌లో తిరుపతిలో పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి నిర్వహణలో జరిగే కార్యక్రమంలో రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డెప్పనాయుడు, రాయలసీమ జిల్లాల గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, మోహన్‌రావు, క్రిష్ణారెడ్డి, నాగేశ్వరరావు, పట్టాభిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఈనాడు
చిత్తూరు
మంగళవారం 10 మే 2011 16 పేజీలు

# రైతులకు మద్దతు ధర కల్పించాలి

కర్నాలవీధి, న్యూస్‌టుడే: రైతులకు మద్దతు ధర కల్పించాలని అఖిలభారత రైతు సంఘాల సమాఖ్య సెక్రటరీ జనరల్ పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పంటలు పండించే విధానాలు.. రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చాలన్నారు. మదనపల్లె ప్రాంతంలో టమోటా రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. సమావేశంలో మాంగాటి గోపాల్‌రెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు, మోహన్‌రావు, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న పెద్దిరెడ్డి చంగల్‌రెడ్డి

PDF compression, OCR, web optimization using a watermarked evaluation copy of CVISION PDFCompressor

# స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య
## ఆంధ్రప్రదేశ్

మే 10, 2011

గౌ॥ శ్రీ యన్. కిరణ్‌కుమార్ రెడ్డి,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి,

హైదరాబాద్

రాష్ట్రంలో ధాన్యం రైతులకు మద్దతు ధర కోసం, వ్యవసాయోత్పత్తులకు న్యాయబద్ధమైన ధర కోసం ఎగుమతులకు అనుమతి తేవాలని ఇప్పటికి అనేకసార్లు మీకు విన్నవించాం. మే 1, 2011వ తేదీన కూడా మీకు స్వతంత్ర రైతుల సంఘాల ఆధ్వర్యంలో సమస్యను క్షుణ్ణంగా వివరించి తగు చర్యల కోసం మిమ్మల్ని కోరాం. అయితే క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారుతోందేతప్ప ధాన్యంకు రేటు మాత్రం రావటం లేదు. ఎప్పుడో రెండేళ్లక్రితం నాటి కనీస మద్దతు ధరకు కూడా కొనే వారు కరవవుతున్నారు.

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కి ధాన్యాన్ని కొని రైతుల్ని ఆదుకోవాల్సిన చట్టపరమైన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఆ బాధ్యతను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. నిత్యావసర సరుకుల రవాణా చట్టం కింద కఠిన చర్యలు తీసుకునే అవకాశమున్నా రైతులను దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు లేకుండాపోయాయి. మద్దతు ధరకే ధాన్యాన్ని కొన్నట్టు మిల్లర్లకు దొంగ సర్టిఫికెట్లు ఇచ్చేస్తూ అధికారులు రైతుల నోట్లో మన్నుకొడుతున్నారు. ఎంఎస్‌పికి ధాన్యం ఏ జిల్లాలో కూడా కొనుగోలు చేయటం లేదన్నది బహిరంగంగా అందరికీ తెలిసిన విషయమే. సన్నధాన్యం క్వింటాలుకు రూ.1030కి కొనాల్సి ఉంటే అంతకు రూ.250 వరకూ తక్కువ రేటుకే వివిధ ప్రాంతాల్లో కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో వెంటనే రెండు తక్షణ, నిర్దిష్ట చర్యలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం...

**1) కనీస మద్దతు ధరకు ఏమాత్రం తక్కువ కాకుండా ధాన్యం కొనుగోలుకు పక్కా ఏర్పాట్లు:**

కనీస మద్దతు ధరకు కొనేందుకు ఐ.కె.పి సహా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెబుతున్నా ఇంతవరకూ ప్రభుత్వం కొనుగోలు చేసింది నామమాత్రమేనని వాస్తవ గణాంకాలు చెబుతున్నాయి. మిల్లర్లు సుమారు 24లక్షల టన్నుల ధాన్యం కొంటే, ప్రభుత్వం 1లక్షన్నర టన్నులే కొనుగోలు చేసిందని అనధికార సమాచారం. ప్రభుత్వం కేవలం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గాలికొదిలేయటం వల్ల ట్రేడర్ల చేతిలో రైతులు మద్దతు ధర రాకుండా నష్టపోతున్నారు. ఈ దోపిడీని అరికట్టి రైతులకు విధిగా ఎంఎస్‌పి లభించేందుకు వెంటనే ఈ దిగువ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాం...

ఎ) ధాన్యం కొనుగోళ్లు పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకీ రాష్ట్ర కార్యదర్శిస్థాయి ఐఎఎస్ అధికారిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలి. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు, అత్యవసర సమయాల్లో ఎలాగైతే చేస్తారో అలాగే ఈ సమయంలో ఉన్నతాధికారి పర్యవేక్షణను ఏర్పాటు చేసి కొనుగోళ్లలో దోపిడీ, అక్రమాలు ఉంటే నిత్యావసర సరకుల చట్టం కింద కఠిన చర్యలు తీసుకునే అధికారాన్ని కల్పించాలి. ధాన్యం నిల్వలు బాగా ఉన్న 12,13 జిల్లాల్లో ఇలాంటి ఏర్పాట్లు అవసరం కావచ్చు.

బి) ప్రతి జిల్లాలో ఉన్న ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షణకు రైతులతో కూడిన కమిటీల్ని ఏర్పాటు చేయాలి.

సి) ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎవరు ఎంత అమ్మిందీ సమగ్ర వివరాలను రోజువారీ బైటపెట్టాలి. అలాగే జిల్లావారీగా మార్కెట్‌లో ఏ రేటుకి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారో రోజువారీగా వివరాలను సేకరించి, బహిరంగంగా ప్రకటించాలి.

డి) ధాన్యం సేకరణకు గోనెసంచుల కొరత, రవాణా, పెట్టుబడి వంటి మౌలిక సదుపాయాల సమస్యలను అధిగమించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎఫ్‌సిఐని సంప్రదించి రొటేషన్ పెట్టుబడిని సమకూర్చుకోవాలి. దాదాపు 70లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని స్థూల అంచనాలు పేర్కొంటున్నాయి. ఇందుకు కావలసిన

PDF compression, OCR, web optimization using a watermarked evaluation copy of CVISION PDFCompressor

గోనెసంచుల్ని, పెట్టుబడిని, రవాణా, నిల్వ ఏర్పాట్లని యుద్ధప్రాతిపదికన సమకూర్చుకోవాలి.

**2) ధాన్యం ఎగుమతులకు ఎంపీలను ముఖ్యమంత్రి అధికారికంగా ఢిల్లీకి తీసుకెళ్లి ఒత్తిడి తేవాలి:**

ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సిఐలోని నిల్వలు కాకుండా కేవలం రైతులు, వ్యాపారస్తుల వద్ద 40లక్షల టన్నుల మిగులు బియ్యం నిల్వలు ఉన్నాయి. దాంతోపాటు రబీ బాగా పండటంతో పెద్దఎత్తున మళ్లీ బియ్యం వస్తోంది. రబీలో ఎకరాకి 30 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి ఉండే క్రమంలో 1 కోటి టన్నుల ధాన్యం ఈ సీజన్‌లో దిగుబడి అవుతుందని అంచనా. అంటే 65లక్షల టన్నుల బియ్యం. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్‌లో 1 కోటి నుంచి 1 కోటి 10లక్షల టన్నుల వరకూ బియ్యం నిల్వలు ఉంటాయి. ఇది కాకుండా రాష్ట్రంలోని ఎఫ్‌సిఐ వద్ద 39లక్షల టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయి. ఎఫ్‌సిఐ లెవీ అవసరాలకు (42లక్షల టన్నులు) పోను రాష్ట్రంలో ఇంకా 60-70లక్షల టన్నుల బియ్యం ప్రైవేటు మార్కెట్లలో అందుబాటులో ఉంటుంది. దేశవ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి. అవసరాలకు కేవలం 2కోట్ల 12లక్షల టన్నుల ఆహారధాన్యాల నిల్వలు అవసరముంటే, మే 2011 నాటికి భారత ఆహార సంస్థ గోదాముల్లో 5కోట్ల 91లక్షల టన్నుల ధాన్యాలు ఉన్నాయి. ఆహారధాన్యాలు ఇబ్బడిముబ్బడిగా పోగుపడటం దీర్ఘకాలిక సరళిగా కనిపిస్తోంది. ఆహారధాన్యాల తలసరి వినియోగం తగ్గుతుండగా, ఉత్పత్తి మాత్రం పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లో రైతు ఆదాయం పడిపోకుండా కనీసస్థాయిలో నిలబడాలంటే మిగులు ఆహారధాన్యాలను ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడకు ధాన్యాన్ని ఎఫ్‌సిఐతోపాటు ఎస్‌టిసి, పిఇసి, ఎంఎంటిసి తదితర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ఎగుమతి చేయాలి. వచ్చిన లాభాల్ని రైతులకే పంచే ఏర్పాటు చేయాలి. **ఎగుమతులపై కేంద్రప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రే స్వయంగా రాష్ట్ర నుంచి ఎన్నికైన పార్లమెంటు సభ్యుల బృందాన్ని అధికారికంగా ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రి, ఇతర సంబంధిత మంత్రులతో సమావేశమై ఎగుమతులకు అనుమతిని సాధించాలి.**

న్యాయబద్ధంగా పొందాల్సిన రేట్లు, ఆదాయం పొందనీయకుండా వ్యవసాయాన్ని, రైతుల్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోవటం సాధ్యం కాదు. సమస్య ఎంత తీవ్రంగా ఉందో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ప్రభుత్వాధికారులే స్వయంగా చెబుతున్నారు. ఇక తాత్సారం ఎంతమాత్రం తగదు. పైన పేర్కొన్న రెండు అంశాల్లో యుద్ధప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. **10రోజుల్లో సమస్యను పరిష్కరించాలి. మే 22వ తేదీలోగా సమస్యను పరిష్కరించకుంటే స్వతంత్ర రైతుసంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతాయి.** అలాంటి ఆందోళనలకు దిగటం మాకు ఇష్టమై కాదు. గత్యంతరం లేకే దిగాల్సి వస్తోంది. స్వతంత్ర రైతు సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు దిగటానికి, పరిణామాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి.

**రైతుల్ని, కౌలుదారుల్ని ఆదుకోవటానికి స్వతంత్ర రైతు సంఘాలు కోరుతున్న పై రెండు డిమాండ్లను మే 22లోగా** నెరవేరుస్తారని ఆశిస్తూ...

అభినందనలతో,

**(డా॥ జయప్రకాష్ నారాయణ్)**
అధ్యక్షులు,
(స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య, ఆంధ్రప్రదేశ్)

**పి. చెంగలరెడ్డి**
(ఛైర్మన్, ఎ.పి రైతు సంఘాల సమాఖ్య)

**మందా బలరామిరెడ్డి**
(రైతు సంఘాల సమాఖ్య)

**బొజ్జా దశరథరామిరెడ్డి**
(కార్యదర్శి, రైతు సంఘాల సమాఖ్య)

**మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి**
(కార్యదర్శి, ఆయిల్‌పామ్ రైతు సంఘం)

M.V.S. Nagi Reddy
**ఎంవిఎస్ నాగిరెడ్డి**
(ఉపాధ్యక్షులు, రైతాంగ సమాఖ్య)

**అనుమోలు గాంధీ**
(రైతు వేదిక)

**పి. భాస్కరరావు**
(కన్వీనర్, స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య)

**జి. నాగేశ్వరరాజు**
(కార్యదర్శి, ఎ.పి రైతు కార్యాచరణ సమితి)

**కె. గంగాధరరావు**
(రైతు వేదిక)

PDF compression, OCR, web optimization using a watermarked evaluation copy of CVISION PDFCompressor